క్లుప్తంగా

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఆర్డీవో దంపతులు



విఘ్నేశ్వరుని సన్నిధిలో పూజలు చేస్తున్న ఆర్డీఓ శ్రీకర్ దంపతులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారిని కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్, రామచంద్రాపురం ఆర్డీవో డి.అఖిల దంపతులు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు, ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఆర్డీఓలు పి.శ్రీకర్, డి.అఖిల దంపతులు స్వామివారికి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారి ఆలయ చరిత్ర వివరించి వేదాశీర్వాదం పలికారు. స్వామి శేషవస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఆర్డీవో

మలికిపురం: మండలంలో శనివారం పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని అమలాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మాధవి పరిశీలించారు. ఆమె గుడిమెళ్లంక గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఆర్డీవో వెంట మలికిపురం ఎంపీడీవో ఎన్.బాలాజీ, తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దింపు కార్మికుడిని ఆదుకోవాలి

అంబాజీపేట: స్థానిక ఉద్యాన పరిశోధన కేంద్రంలో కొబ్బరి చెట్టు పై నుంచి ప్రమాదవశాత్తూ పడిపోయిన దింపు కార్మికుడు బొక్కా వెంకట నగేష్‌బాబును ప్రభుత్వంతో పాటు యాజమాన్యం ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పరిశోధన కేంద్రాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.బలరామ్‌లు సందర్శించి కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీ చలపతిరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైబ్రిడ్ కొత్త వంగడం తయారీలో పనిచేస్తూ కొబ్బరి చెట్టుపై నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రమాద భీమా కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ కన్వీనర్ బీర ఎస్తేరు రాణి, బి.సోమశేఖర్, వాసంశెట్టి లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

గురజాడ సేవలు చిరస్మరణీయం

రాజోలు: కవిశేఖరుడు, మహాకవి గురజాడ అప్పారావు సేవలు చిరస్మరణీయమని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. శనివారం కళాశాల సమావేశ మందిరంలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు వర్ధంతి నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురుజాడ తన రచనలతో సమాజంలో సాంఘిక పరివర్తన తీసుకువచ్చారన్నారు. కన్యాశుల్కం నాటకం సాహితీలోకంలో ప్రత్యేకమైన స్థానం దక్కించుకుందన్నారు. తెలుగు అధిపతి పి.శైలజ, డాక్టర్ బోస్, కె.నారాయణరావు, నల్లి రాజు, ఎం.అశ్వని, వీఎస్‌కే కృష్ణమూర్తి, సునీత, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అదనపు డయాలసిస్ యూనిట్ల ఏర్పాటుకు కృషి

రాజోలు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఉన్న డయాలసిస్ సెంటర్‌కు అదనంగా మరో ఐదు యూనిట్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం రాజోలు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఆస్పత్రిలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ రేవు జ్యోతి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మట్టపర్తి లక్ష్మి, ఉలిశెట్టి అన్నపూర్ణ, పితాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన వడ్లమాని వేణుగోపాలరావు, సూర్యకుమారి దంపతులు రూ.10 వేలు, రాజమహేంద్రవరం దివాన్ చెరువుకి చెందిన కె.తిరుమల కృష్ణారావు రూ.10,116లు విరాళంగా అందజేశారు. శనివారం దాతలు ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. దాతలను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. వీరిని ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

నేడు చండీహోమం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఆదివారం చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయ ఆవరణలో ఉదయం ప్రారంభమయ్యే చండీహోమాన్ని అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కనులారా వీక్షించాలని కోరారు. చండీహోమంలో పాల్గొనే భక్తులు ఆలయంలోని కార్యాలయం వద్ద సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భారీ వర్షంతో రైతుల్లో గుబులు

నేలకొరిగిన వరిపైరు



నగరంలో భారీ వర్షానికి పడిపోయిన పంట పొలాలు

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను ప్రభావంతో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఖరీఫ్ పంట చేతికందే సమయంలో భారీ వర్షాలు కురవడంతో పలు ప్రాంతాల్లో పంట పడకేసింది. వర్షానికి వరి కంకులు తడిసిపోయి పంట నేలకొరిగింది. ఎంతో కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో తుపాను ఏర్పడడం రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. మామిడికుదురు మండల పరిధిలో 2420 ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ సాగు చేశారు. కేవలం 300 ఎకరాల్లో మాత్రమే కోతలు పూర్తయ్యాయి. మిగిలిన పంట కోత దశకు వచ్చింది. అరుగాలం శ్రమించి పంట పండించామని, ఈ దశలో ఏర్పడిన తుపానుతో దిగుబడి దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు తీవ్రంగా మదనపడుతున్నారు. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని వరి పంట సాగు చేశామని, తీరా పంట చేతికందే సమయంలో తుపాను తమ పాలిట శాపంగా మారిందని రైతులు వాపోతున్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ఫెంగల్ తుపాను కారణంగా అంబాజీపేట మండలంలో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తుంది. ఆకాశమంతా మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. దాంతో స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌తో పాటు పుల్లేటికుర్రు, ముక్కామల, మాచవరం ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. రహదారులు జలమయమయ్యాయి. తుపాను ప్రభావంతో వర్షాలు పడటంతో మాసూళ్లకు ఆటంకం ఏర్పడింది. వరి కోత యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యాన్ని రాశులు చేసి, టార్పాలిన్లు, బరకాలను కప్పారు. రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో రైతాంగం అప్రమత్తమైంది. దీంతో వరి కోతలను రైతులు వాయిదా వేసుకున్నారు. పంట చేతికందే సమయంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతులతో ఆందోళన నెలకొంది.



అంబాజీపేటలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: తుపాను ప్రభావంతో శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి చేలు, కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులు, ధాన్యం బస్తాలకు బరకాలు కప్పి పంటను కాపాడుకుంటున్నారు. మండలంలో అక్కడక్కడా వరిచేలు నేలకొరగడంతో రైతులు అవేదన చెందుతున్నారు. కోతకు వచ్చిన చేలు నేలమట్టమైతే ధాన్యం రంగుమారి నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు.

తుపాను ప్రభావంపై ఆర్డీవో సమీక్ష



సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో తుపాను ప్రభావంపై సమీక్షిస్తున్న ఆర్డీవో మాధవి

సఖినేటిపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుపాను ప్రభావం, తీవ్రతపై అమలాపురం ఆర్డీవో కె.మాధవి, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. శనివారం ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తుపాను తీవ్రతను బట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆర్డీవో ఆదేశించారు. ప్రధానంగా సముద్ర తీరప్రాంత గ్రామాల్లో ఆయా శాఖల సిబ్బందిని మరింత అప్రమత్తం చేయాలని, ఎప్పటికప్పుడు తుపాను పరిస్థితి అంచనా వేస్తూ ప్రజలకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆర్డీవో సూచించారు. వీటితో పాటు తుపాను తీవ్రతను బట్టి బాధితులకు తుపాను షెల్టర్లకు చేర్చడంలోను, అక్కడ వారికి తగిన సాయం అందజేసేందుకు పూర్తి సన్నద్ధంగా ఉండాలని కూడా ఆదేశాలు ఆమె ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దారు సీహెచ్ భాస్కర్, ఎంపీడీవో కె.సూర్యనారాయణ, ఏవో పీవీ నరసింహారావు, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వి.రామరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీష, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో భక్తుల రద్దీ



అంతర్వేది ఆలయంలో భక్తుల క్యూను పర్యవేక్షిస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తిక మాసం చివరి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప, భవానీ, మాలధారణ భక్తులు స్వామి సన్నిధికి వచ్చారు. స్వామివారి దర్శనంలో వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) వి.సత్యనారాయణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమంలో కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి సన్నిధికి తరలి వచ్చిన భక్తులకు నిత్యాన్నదానంలో భోజన వసతికి దేవస్థానం ప్రత్యేక చర్యలు తీసుకుంది. వచ్చే నెల 16వ తేదీ నుంచి ధనుర్మాసం ప్రారంభం కానుందని ఏసీ తెలిపారు. ఈ రీత్యా స్వామివారి ఆర్జిత అభిషేకం వచ్చే నెల 17వ తేదీ నుంచి జనవరి 13వ తేదీ వరకూ తెల్లవారుజామున 4.30 నిమిషాలకు అర్చకులు నిర్వహిస్తారన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పారా లీగల్ వలంటీర్లకు సూచనలు చేస్తున్న న్యాయమూర్తి ప్రమీలారాణి

రాజోలు: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి కోరారు. శనివారం కోర్టు కాంప్లెక్స్‌లో పారా లీగల్ వలంటీర్లకు న్యాయమూర్తి గుర్తింపు కార్డులు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. కక్షిదారులకు పారా లీగల్ వలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొల్లమందల స్టాలిన్, న్యాయవాదులు జాలెం భాస్కరరావు, ఆచంట శ్రీనివాస్, ఏజీపీ అయ్యప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తేమ శాతం ఎంత ఉన్నా ధాన్యం కొనాల్సిందే..



కె.పెదపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

అంబాజీపేట: ధాన్యంలో తేమ శాతం ఎంత ఉన్నప్పటికీ రైస్ మిల్లర్లు కొన్నాలిందేనని తహసీల్దార్ జి.వెంకటేశ్వరి తెలిపారు. కె.పెదపూడిలో ఉన్న ధాన్యాన్ని ముక్కామల రైస్ మిల్లుకు తరలించేందుకు శనివారం రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మిల్లుకు తీసుకువచ్చిన ధాన్యం తేమ శాతాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. మండలంలో 3009 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా ఇప్పటి వరకు సుమారు 700 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయన్నారు. ధాన్యం నిల్వ చేసుకోవాలనుకున్న రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భద్రపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి సాయం



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: కిడ్నీ అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.10 వేలు చెక్కును సాయంగా అందజేశారు. గ్రామానికి చెందిన షేక్ అమ్మాజీ (78). ఆమెకు భర్త, పిల్లలు ఎవరూ లేరు. ఈ మధ్య ఒక కిడ్నీ చిన్నది అయిపోవడంతో ప్రతి నెల రూ.5 వేల మందులు వాడాలని డాక్టర్లు చెప్పారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేక మందులకు డబ్బులు లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. సంస్థ సభ్యులు రావులపాలెంలోని షేక్ అమ్మాజీ ఇంటికి వెళ్లి రూ.10 వేల చెక్కు అందజేశారు.

గురుకుల విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ



విద్యార్థులకు కళ్లజోళ్లు అందించిన గుడ్‌విల్ సంస్థ నిర్వాహకులు

రాజోలు: శివకోడు గురుకుల బాలిక పాఠశాల విద్యార్థినులకు గుడ్‌విల్ ఎడ్యుకేషన్ సోషల్ సర్వీసెస్ సొసైటీ(జీఈఎస్ఎస్ఎస్) ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. గత నెల 30న నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కళ్లజోళ్ల అవసరాన్ని గుర్తించి ఉచితంగా అందించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లలితకుమారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ చంద్రశేఖరరావు, కార్యదర్శి ప్రశాంతి రోజా ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. నిరుపేద విద్యార్థులకు గుడ్‌విల్ సంస్థ అండగా నిలుస్తుందన్నారు. ప్రొగ్రాం డైరెక్టర్ పట్టపు శ్యాంబాబు, ఈదా నెహేమియా, చంద్రమౌళి, జాన్ పుల్లయ్య, ఎన్.కృష్ణ, ఆరోగ్య సమన్వయ కర్తలు ఉమ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిశాయి. చింతలూరు, సందిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేశారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేద పండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాలసేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఎయిడ్స్‌పై అవగాహనతో ఆరోగ్య జీవనం

కొత్తపేట: ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్య జీవనం సాగించాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జి.దుర్గాప్రసాద్ అన్నారు. హెచ్ఐవీ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ, అవిడి పీహెచ్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వద్ద ఐసీటీసీ కౌన్సిలర్ మెల్లం దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆస్పత్రి వైద్యాధికారి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ హెచ్ఐవీపై మొదట్లో అవగాహన లేక, తగు జాగ్రత్తలు తీసుకోక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. తర్వాత హెచ్ఐవీ సోకిన వ్యక్తులకు యాంటీ రిట్రో వైరల్ తెరపి, ఏఆర్‌టీ మందులను ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఆ మందులు వాడిన వ్యక్తులకు వ్యాధి తీవ్రత తగ్గడమే కాకుండా ఆరోగ్యంగా జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వీరబాబు, హెడ్ స్టాఫ్ నర్స్ దేవీజనని, ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.దుర్గాప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ అడబాల వెంకటరత్నం, పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ వాడ సద్గుణరావు, సాయిశ్రీ, మమత తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

రావులపాలెం: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొత్తపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ఎండీ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, జువాలజీ, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ కె.సౌజన్య సంయుక్త ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఐసీటీసీ కౌన్సిలర్ డీఎం ప్రసాద్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సమాజంలో యువత పెడదారిని పడుతుందని, అనేక చెడు వ్యసనాలకు లోనవుతున్నారని, మత్తుమందుల బారిన పడి తమ ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారని వీటిని విడనాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు బిపిన్ రెడ్డి, సత్యమూర్తి, సుభాషిణి, సుమలత, రజని, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

అయినవిల్లి: మండలంలోని చింతనలంకలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు బ్లెస్సీ నిర్మల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరలోక అగ్ని అపొస్తలిక్ మినిస్ట్రీస్ ఫౌండర్ చైర్మన్ ఎన్.పాల్ ఆయన కుటుంబ సభ్యులతో శనివారం పరామర్శించి బియ్యం, నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన వెంట శేఖర్ థామస్, తేజ, తదితరులు ఉన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి ముత్తబత్తుల నాగమణి పార్టీ అయినవిల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో చింతనలంక అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల నష్టాన్ని ఆ శాఖ నుంచి నష్టపరిహారం అందించాలన్నారు. ఆమె వెంట పార్టీ అయినవిల్లి మండల కార్యదర్శి ముత్తబత్తుల గుణవర్ధనమ్మ, కమిటీ సభ్యులు కొట్టాల అనంతలక్ష్మి, కారపు లక్ష్మి, అరుణ తదితరులు ఉన్నారు.



అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి తదితరులు

వైఎస్సార్ సీపీ నాయకుల అండ

మండలంలోని సిరిపల్లిలో సర్వం కోల్పోయిన అగ్ని ప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ అండగా నిలిచింది. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శించి పార్టీ నుంచి తాము ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ సవరపు సుబ్బారావు, సవరపు నాగూరు, ముమ్మిడివరపు అబ్బులు, ముమ్మిడివరపు పుల్లయ్య, సవరపు సోమరాజు, కొల్లు కనకదుర్గ, సవరపు నాగరత్నంలకు ఒక్కొక్కరికి రూ.మూడు నగదు, పది కిలోల బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అయినవిల్లి మండలశాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, సర్పంచులు విళ్ల వెంకటరత్నం, బొంతు మణి, ఎంపీటీసీ చల్లాబత్తుల సాయిలక్ష్మి, నాయకులు సరిపల్లి కనకరాజు, రావూరి వెంకటరామారావు తదితరులు ఉన్నారు.

వ్యాఘ్రేశ్వరునికి లక్ష బిల్వార్చన

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో వ్యాఘ్రేశ్వర స్వామికి శనివారం లక్ష బిల్వార్చన ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గంగలకుర్రులోని సర్వమంగళ పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి, ఉమా సమేత ఆనందేశ్వర స్వామి వార్లకు, మాచవరం పార్వతీ రాజరాజేశ్వరస్వామి, కందుల మల్లేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, లక్ష పత్రి పూజలు చేశారు. మండలంలోని అన్ని శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు.

తొత్తరమూడిలో..

అయినవిల్లి: మండలంలోని వెలువలపల్లి, తొత్తరమూడి గ్రామాల్లో కొలువైన కనకదుర్గ సమేత రాజరాజ నరేంద్ర స్వామి, ముక్తేశ్వరస్వామికి శనివారం సామూహిక లక్ష బిల్వార్చన పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు సాంబేశ్వరస్వామి, శేఖర్, శ్రీకంఠ చక్రవర్తి ఆధ్వర్యంలో స్వామివార్లకు మహన్యాసం, పంచగవ్యం, మృత్తిక శివలింగార్చన, సూర్యనమస్కారాలు, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు జరిపారు. స్వామివారిని వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. దీపార్చన చేశారు. సాయంత్రం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.

గోశాలకు ఎండుగడ్డి విరాళం



చింతలూరులోని గోపరంధామం గోశాలకు ఎండుగడ్డిని తరలిస్తున్న దాత రాంబాబు

ఆలమూరు: గోవులను అత్యంత శ్రద్ధాశక్తులతో పెంచి పోషిస్తున్న మండలంలోని చింతలూరుకు చెందిన గోపరంధామం గోశాలలకు శనివారం ఎండుగడ్డి విరాళం అందజేశారు. మండలంలోని గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు తన సొంత నిధులు సుమారు రూ.పది వేలు వెచ్చించి ఒక ట్రాక్టర్ గడ్డిని కొనుగోలు చేసి మోపులుగా తయారు చేసి నిర్వాహకులకు అందజేశారు. దాత రాంబాబును గోశాల ప్రతినిధులు అల్లంరాజు భరణి, నామాల రామకృష్ణ, వెల్ల సత్యనారాయణ తదితరులు అభినందించారు.

నవంబర్ బకాయిలతో పింఛన్ పంపిణీ



కొత్తపేట ఏనుగులమహల్‌లో వృద్ధుడికి రెండు నెలల పింఛన్ అందజేస్తున్న ఎంపీడీఓ నరేష్‌కుమార్

కొత్తపేట: మండలంలో గత నెల బకాయిలతో కలిపి రెండు నెలల పింఛన్ పంపిణీ చేస్తున్నట్టు ఎంపీడీఓ పీఎస్ఎన్ కుమార్ తెలిపారు. మండలంలోని 10 గ్రామాల్లో 10,382 పింఛన్లకు గత నెలలో అభయహస్తం పింఛన్‌లు 4, వృద్ధాప్య పింఛన్లు 33, వితంతు పింఛన్లు 20, దివ్యాంగ పింఛన్లు 8, చేనేత పింఛన్ ఒకటితో కలిపి మొత్తం 66 మంది వివిధ సామాజిక పింఛన్‌దారులు వేరు వేరు కారణాలతో తీసుకోలేదన్నారు. వారందరికీ ఆ నెల బకాయి మొత్తం 2.26 లక్షలు ఈ నెల పింఛన్‌తో కలిపి పంపిణీ చేసినట్టు తెలిపారు. ఆ మేరకు పలు గ్రామాల్లో ఆయన చేతుల మీదుగా రెండు నెలల పింఛన్ నగదు అందజేశారు. ఆయన వెంట వెల్ఫేర్ అసిస్టెంట్ లలిత తదితరులు ఉన్నారు.

వైభవంగా లక్ష తమలపాకుల పూజ

మామిడికుదురు: స్థానిక అభయాంజనేయస్వామికి శనివారం హనుమాన్ చాలీసా పారాయణ సహిత లక్ష తమలపాకుల పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అభయాంజనేయ స్వామికి విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, మండపారాధన, అభిషేకం, తమల పాకులు, గంధ సిందూరంతో ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాలను ఘనంగా జరిపించారు. సుదర్శనం వెంకట జనార్దనాచార్యుల ఆధ్వర్యంలో బిక్కవోలు కేశవాచార్యుల పర్యవేక్షణలో ఈ పూజలను అంగరంగ వైభవంగా జరిపించారు. అక్కిరాజు శ్రీనివాస్ బృందం ఆలపించిన హనుమాన్ చాలీసా పారాయణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అభయాంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు.

బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలు

అంబాజీపేట: బాలబాలికలు రక్తహీనతకు గురికాకుండా ఉంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు. పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కనకదుర్గ అధ్యక్షతన బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలను శనివారం నిర్వహించారు. బాలికలకు రక్తహీనత, రక్తపోటు, మధుమేహం తదితర రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రవికుమార్, ఎస్ఎంసీ చైర్మన్ నూకరత్నమాల తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ



మారేడుమిల్లి గిరిజన తండాల్లో దుస్తులు అందజేస్తున్న విద్యార్థులు

ఆలమూరు: స్థానిక సిద్ధార్థ హైస్కూల్‌కు చెందిన విద్యార్థుల చేతుల మీదుగా దుస్తుల పంపిణీ జరిగింది. అల్లూరు సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో సమీపాన గిరిజన తండాలకు హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు, కరస్పాండెంట్ కె.ముల్లారావు ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులు తరలివెళ్లారు. ఫౌండేషన్ సమకూర్చిన దుస్తులను అక్కడి గిరిజన తండాల ప్రజలకు ఉచితంగా అందజేశారు. 'ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న' అనే నినాదంతో ప్రారంభమైన ఈ ఫౌండేషన్‌కు విద్యార్థులు చేస్తున్న సేవను పలువురు కొనియాడారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

కొత్తపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో జరిపిన దాడుల్లో సారా కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు శాఖ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో సత్యనారాయణను 5 లీటర్ల సారాతో అరెస్టు చేసి, స్థానిక మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఆమె తెలిపారు.